

ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు నక్క రాజశేఖర్ గౌడ్, వరప్రసాద్ రెడ్డి, మహేందర్‌పాల్ సింగ్, నక్క శివగౌడ్, స్టీఫెన్, రాంబాబు, సతీశ్, సందీప్, సుమన్, సునీల్‌తో పాటు మరో 50 మంది ఉన్నారు.

–మల్కాజిగిరి, నవంబర్ 1

## కారెక్కిన కనుకుల..

### మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిక



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ జాతీయ సేవాదళ్ కోశాధికారి, మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్ రెడ్డి

కంటోన్మెంట్, నవంబర్ 1: కాంగ్రెస్ పార్టీ జాతీయ సేవాదళ్ కోశాధికారి, మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్ రెడ్డి కారెక్కారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, మంత్రి మల్లారెడ్డి సమక్షంలో జనార్దన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. జనార్దన్ రెడ్డి సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్ర సేవాదళ్ విభాగం అధ్యక్షుడిగా పనిచేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్‌లోని కేజేఆర్ గార్డెన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. గాంధీ భవన్ టికెట్ల అమ్మకానికి అడ్డాగా మారిందని ఆరోపించారు. టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి సీనియర్లకు గౌరవం ఇవ్వడం లేదన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి కాకుండా బయటి వ్యక్తులకు టికెట్లను కేటాయిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ తాజా విధానాలు నచ్చకే కాంగ్రెస్ పార్టీకి, సేవాదళ్ జాతీయ కోశాధికారి పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

## హత్యా రాజకీయాలను ప్రజలు హర్షించరు



మంత్రి తలసానికి హారతి ఇస్తున్న బాపూనగర్ వాసులు

అమీర్‌పేట్, నవంబర్ 1 : యాభైఏండ్ల పాటు అధికారంలో కొనసాగిన కాలంలో ప్రజలకు ఏమీ చేయలేని వారు.. ఇప్పుడు కొత్తగా తామేదో చేస్తామంటూ కల్లబొల్లి మాటలతో ప్రజల ముందుకు వస్తున్నారని, ఇది వారి దివాళాకోరు తనానికి నిదర్శనమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం అమీర్‌పేట్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మెదక్ ఎంపీ, దుబ్బాక అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. అలాగే మంత్రి తలసాని బాపూనగర్ బస్తీలో ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీ మహిళలు మంత్రి తలసానికి అడుగడుగునా మంగళ హారతులతో స్వాగతం పలికారు.

## బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

శంషాబాద్ రూరల్, నవంబర్ 1 : బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. బుధవారం శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లి కొత్తతండా సర్పంచ్ దేవానాయక్ ఆధ్వర్యంలో 150 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# సంక్షేమం.. అభివృద్ధికే జై

- అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలి
- కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



అన్నోజిగూడలో గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, నవంబర్ 1: ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికే జై కొట్టనున్నారని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారం మున్సిపాలిటీలో అన్నోజిగూడలో రాజునాయక్, విక్రమ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో 600 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బోడుప్పల్ రెండో డివిజన్‌లో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో 100 మంది, గుండ్లపోచంపల్లి..బాసరేగడికి చెందిన 25 మంది కాంగ్రెస్‌కు చెందిన యువకులు కౌన్సిలర్ రాజకుమారి సుధాకర్ ఆధ్వర్యంలో అలియబాద్‌లో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్శితులై స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. సమైక్య పాలనలో కాంగ్రెస్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. కరెంట్, నీళ్లు లేక రైతులు ఆత్మహత్య చేసుకునే దుస్థితి కల్పించిందని విమర్శించారు. బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పార్టీలో చేరిన రాజునాయక్ మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను తరిమికొట్టి, గులాబీ జెండాను ఎగురవేసే వరకు నిద్రబోమన్నారు.

## కూకట్‌పల్లిలో బీజేపీ వర్సెస్ జన సేన



మూకుమ్మడి రాజీనామా చేసిన బీజేపీ నేతలు కాంతారావు, రాజేశ్వర్‌రావు, ముఖ్య నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 1 : బీజేపీ, జనసేన పొత్తు కూకట్‌పల్లి బీజేపీ నేతల మూకుమ్మడి రాజీనామాకు దారితీసింది. రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బీజేపీ, జనసేన పార్టీలు కలిసి పోటీ చేసేందుకు నిర్ణయించాయి. దీనిలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని జనసేకు కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తుండటంతో... బీజేపీ టికెట్ ఆశావహులంతా ఆందోళన బాటపట్టారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కూకట్‌పల్లి బీజేపీ ఆశావహులు, ముఖ్య నేతలంతా ఆందోళన నిర్వహించి బీజేపీకే టికెట్ కేటాయించాలని ఆందోళన నిర్వహించారు. అయినా అధిష్ఠానం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో.. కూకట్‌పల్లి నియోజకవర్గం బీజేపీ టికెట్ ఆశిస్తున్న కాంతారావు, వడ్డెపల్లి రాజేశ్వర్‌రావులతో పాటు ఆయా డివిజన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నేతలు బుధవారం మూకుమ్మడి రాజీనామా పత్రాన్ని అధిష్ఠానానికి పంపారు. నిత్యం ప్రజల్లో ఉంటూ.. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించామని తెలిపారు. ఆయా సంస్థలు నిర్వహించిన సర్వేలో సైతం బీజేపీయే రెండోస్థానంలో బీఆర్ఎస్‌కు పోటీ ఇస్తుందని తేలిందన్నారు. కానీ.. కనీసం పోటీనిచ్చే నాయకులు లేని జనసేనకు టికెట్ కేటాయిస్తే బీజేపీ నేతలు సహకరించేది లేదని తెలిపారు. ఇది ఇలా ఉండగా..కూకట్‌పల్లిలో పోటీ చేసేది జనసేన అభ్యర్థేనని ఆ పార్టీ నేతలు సంబురాలు చేసుకుంటున్నారు.



తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప్పల్, మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, తాడూరి శ్రీనివాస్ తదితరులు

## అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

### బీఆర్ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం

చర్లపల్లి, నవంబర్ 1 : అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఉప్పల్, మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని పరివార్‌లో బీఆర్ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనానికి ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీనివాస్‌తో కలిసి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో న్యాయవాదుల పాత్ర కీలకమైనదని, న్యాయవాదుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ వంద కోట్ల నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు బీఆర్ఎస్ అభ్యర్థులు బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డిలకు మద్దతు ప్రకటించారు. అనంతరం ఈ నెల 4వ తేదీన జలవిహార్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పావనీమణిపాల్‌రెడ్డి, రామారావు, అంజయ్య, న్యాయవాదులు యాదగిరిరావు, రవికాంత్, సుధీర్‌కుమార్, రమేశ్, స్టాడింగ్ కౌన్సిల్ సభ్యుడు కొమరయ్య, బార్ స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి సునీతారాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. మల్లికార్జున నగర్‌లో వడ్డెర సంఘం అధ్యక్షుడు వరుసు లింగయ్య ఆధ్వర్యంలో సంఘం సభ్యులు 100 మంది బండారి లక్ష్మారెడ్డికి తమ మద్దతు ప్రకటించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



## సంక్షేమానికి ఆకర్షితులై చేరికలు

బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకుడు ఎంకే బద్రుద్దీన్ ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన నాయకులు హోంమంత్రి మహమూద్ అలీ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ఇమ్రోస్ ఖాన్, మహ్మద్ రహమాన్ షరీఫ్, మహ్మద్ అబ్దుల్లా షరీఫ్, మహ్మద్ యూసుఫ్, మహ్మద్ రహ్మద్ షరీఫ్‌లకు హోంమంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి తనయుడు ఆజాం అలీ, మాజీ కార్పొరేటర్ ప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

– అబిడ్స్, నవంబర్ 1

## కార్మికుల పక్షపాతి సీఎం కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

జీడిమెట్ల, నవంబర్ 1 : తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల సంక్షేమానికి ఎన్నో సంస్కరణలను ప్రభుత్వం తీసుకొచ్చిందని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి , ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. బుధవారం సుభాష్‌నగర్ డివిజన్ ఓం జెండా వద్ద తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుత్బుల్లాపూర్‌లోని ఎన్నో పరిశ్రమల్లో వేతన ఒప్పందాలు కుదిర్చి కార్మికుల సమస్యలను పరిష్కరించామన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. మాజీ కార్పొరేటర్ జి.సురేశ్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా ఫిషరీష్ కో– ఆపరేటివ్ చైర్మన్ మన్నెరాజు, ట్రేడ్ యూనియన్ నాయకులు మాల్యాద్రి, కోటేశ్, సురేశ్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు. కాగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి.. 21వ డివిజన్‌కు చెందిన శ్రీసాయినగర్ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కేపీ.వివేకానంద్‌కు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.